# "జగన్నాటకం"

శ్రీమతి 'హృదయిని'

(గతసంచిక తరువాయి)

[మాలతిని ఉత్సాహ పరచడానికని అనూ నాటకం చూడడానికి రమ్మని ప్రోత్సహించింది. మాలతి తండ్రితోకూడ అనూతో బయలు దేరి వెళ్లి స్టేజిదగ్గరగా కూర్చుంది — నాటకం ప్రారంభమయింది. లత, బ్రహ్మచారి ఆశ్రమవాసులు. ఆశ్రమనియమావళికి విరుద్ధంగా వారిలో ప్రేమబీజాలు మొలకలెత్తి క్రమంగా ప్రవర్ధమానం కాసాగినవి. దానిని రహస్యంగా తోడి ఆశ్రమవాసులు, గురువు కనిపెట్టి అప్పుడప్పుడు మందలిస్తుండేవారు కాని వారి ప్రణయాన్ని అడ్డలేక పోయారు. గురువు చండప్రచండుడై మండిపడ్డాడు. బ్రహ్మచారి గురువును ప్రాథేయ పూర్వకంగా లతను తాను వివాహమాడి గృహస్థాశ్రమం స్వీకరించడానికనుజ్ఞ అడిగాడు. గురువు నిరాకరించి లత, బ్రహ్మచారి ఒకరితో నొకరు సంభాషించుకో కూడదని శాసించి వారి అపరాధమునకు వారంరోజులు ఉపవాసశిక్ష విధించాడు. యిక చదవండి]

లతా సుబుద్ధు లొకవైపు, గురూజీ మాధవు లొక వైపు నడిచారు. తెర వాలింది. ప్రేక్షకుల్లో చిన్న కలకలం. ముందు కథ యెలా నడుస్తుందో అనే ఆసక్తి అందరిని చుట్టుముట్టింది. జరిగినకథ ప్రథమాంకం కాబోలు. నేను మా మాలతివైపు చూచాను. ఆమె ఉద్వేగపూరిత హృదయంతో నన్నిలా అడిగింది.

'అనూ ! నాటకంలో మాధవపాత్రధారి ఎవరో?'

'ఏం. ఆయన్నుగూర్చి అడుగుతున్నావు !'

'నేను ఆశ్రమంలో కొన్నాళ్లుండి వచ్చానే, అక్కడగూడా ఈ మాధవుడిలాటి ఒక యువక సన్యాసి యుండేవాడు. వారి పేరుగూడా మాధవుడే ! వారి పేరుగూడా మా - ధ - వు - డే !!'

'ఈ మాధవుడు నాటకంలోవాడుగదా !'

'అనూ ! నీతో నేనెప్పుడూ నా ఆశ్రమ జీవితం గూర్చి చెప్పలేదు. మాధవుడంటున్నా నే ... వారినిగూర్చి నీకు తెలియదు !'

'ఆయనగూడ ఈ నాటకంలో లాంటివాడా !'

'అవును' అని ఒక నిట్టూర్పు విడిచింది మాలతి.

ఇంతలో తెర లేచింది. అది ఆశ్రమంలోని ఒక గది. ఒక బల్లమీద కృష్ణాజినం పరిచిఉంది. దాని మీద గురూజీ పెద్ద తలగడదిండు నాధారంగా పండుకొని ఉన్నాడు. అతడి పాదాలను ఒత్తుతూ ఒక ప్రౌఢ సన్యాసిని కూర్చుని ఉంది. వారిద్దరికీ ప్రక్కగా ఒక దీప స్తంభం మంద మందమైన కాంతులతో వారిద్దరూ కనుపించేటట్లు వెలుగుతూంది.

ఆమె:—'స్వామీ, ఈ జీవితం నాకెంతో హాయిగా ఉంది. ఈ దాసురాలికి మీ చరణసేవ ననుగ్రహించి ధన్యురాలినిచేశారు. రోజూ మీ సంసేవనం చేయటంలో నాకెంతో సంతృప్తి!'

గురూజీ:—'సాధకురాలా! గురు ప్రేమను పొందటమే శిష్యుల కతిముఖ్యమయింది. అతి దుర్లభమయింది! అట్టిది నీకు నీ సుగుణ సంపత్తివలన సులువుగా చేకూరింది. ఇక నీవు ఇహలోకమందే అమరానందాన్ని అనుభవించటానికి అర్హురాలవు. నీకేమి కావాలన్నా ఈ నిత్యానంద స్వామి - ఈ పవిత్రాశ్రమాధికారి నీ కనుసన్నల కదలుచుండగా నీకింకేమి కొదువ! స్వాతీ! దగ్గరకు రా! నీ తను స్పర్శలో ఏదో బ్రహ్మానందం - ఏదో అఖండానందం నిండిఉంది! నిజముగా నీవు నా ఆరాధ్యదేవివి!'

ఆమె:—'స్వామీ! అది అంతా నా అదృష్టం. ఈ ఒంటరి భిక్షుకురాలిపై మీకెంత మమత - ప్రేమ! (అని గురుని సమీపించింది.)

గురు:—'శిష్యురాలా, శీఘ్రకాలంలో నీకు సమాధి సిద్ధిస్తుందని నా అంతరాత్మ చెపుతుంది ... నేన భయమిస్తున్నా. ఏదీ - ఆ వీవనతో కొంచెమిటు విసురు.'

ఆమె:—'(వీవనతో విసురుతూ) ప్రతిదినమూ మీరాదేశించినట్లు సాధన చేస్తున్నానుగదా. మీరు నా హృదయంపై తమ ప్రేమతో నిండిన చేతితో స్పృశిస్తున్నపుడల్లా నాకదే సమాధిగా ఉండేది. సమాధి అంటున్నారు. ఇంకొక రకమైనదేమైనా ఉన్నదా! అదెలా!'

గురు:—'అదే 'సదానంద సమాధి' అని అంటారు హఠయోగులు! ఎన్నిసార్లుపొందినా అందలి ఆనందాని కంతులేదు. ఏదీ నీ చల్లని చేతిని నా హృదయంపైఉంచు. భయమెందుకు? నీ కిది కొత్త కాదుగా!'

ఆమె గురూజీ గుండెలపై తన చేతిని ఉంచింది. ఇద్దరు పరస్పరం రెప్పవాల్పకుండా చూచుకొనసాగారు. ఇద్దరి పెదవులు కంపించేయి. నేనూ మాలతీ ఒకరి నొకర్ని చూచుకున్నాము. ఇందాక ఆ జంట! ఇపుడీజంట! ఎంత విభిన్నమైనవి! తిరిగి యుద్ధరం నాటకంపైపు దృష్టి ఉంచాము.

ఆమె:—'స్వామీ! ఒక మాట! లతా మాధవులకు ఉపవాసదీక్ష విధించారటగా!'

గురు:—'స్వాతీ! నీకు తెలిసిందేకదా వారిద్దరికథ. ఆ ప్రేమలత ఈ మాధవ వృక్షాన్ని పెనవేసికొని పుష్పించి ఫలింపబోతూన్నది. ఇంకేమున్నదీ-అదే జరిగితే. ఆశ్రమ గౌరవం - మన అధికారం - మంటకల్సిపోవూ! క్షమించినట్లు మిషతో శిక్షగా వారం రోజుల ఉపవాసదీక్ష విధించాను.

ఆమె:—'అలా అయితే మన యిద్దరికికూడా శిక్ష...'

గురు:—'స్వాతీ! గురూజీ సేవే నీకు శిక్ష. నాకానందాన్ని ప్రసాదించటమే నాకు శిక్ష. దగ్గరకు రా!'

ఆమె:—'స్వామీ! మాధవుడు చాలా మంచివాడు. అమాయకుడు.'

గురూజీ వినుపించుకోనట్లు ఆమె హస్తాలను తీసికొని తన హృదయంమీద హత్తుకొనసాగాడు - హఠాత్తుగ ప్రక్క తలుపు తెరవబడింది. ఒక మానవఛాయ ఇద్దరిమీద పడింది. స్వాతీ గురూజీలు త్రుళ్ళిపడిలేచారు.

గురువు మండుతున్న కొరివిలా - 'ఎవరు నీవు? గురుని ఏకాంత శయ్యా గృహానికి పిల్లిలా నిశ్శబ్దంగా ఎందుకు వచ్చావు?'

తలుపు పట్టుకు తూలుతూ లోపలికివచ్చి ఆ మానవుడు - 'స్వామీజీ! ఈ నిర్భాగ్య మానవుడు మీ దీనహీన శిష్యుడు మాధవుడే!'

గురు:—'నీవా! పగపూనిన త్రాచువై గురువునే పరీక్షింపవచ్చావా! అభాగ్యుడా! నిలు—, నీకు

తగిన సత్కారం చేయిస్తా!' అంటూ లేచి ఒక్కుమ్మడి మాధవుని స్వాతిమీదకు త్రోసి బిగ్గరగా - సుబుద్ధీ! కరటకా, దమనకా! ఇటు పరుగెత్తుకురండి!

ఒక్కొక్కరు క్షణంలో ముగ్గురు వచ్చారు. స్వాతీ మాధవులు మూగ ప్రతిమల్లా ఉండిపోయారు.

గురు:_'అదేమిట్రా అలా చూస్తూ నిలబడ్డారు ఇదుగో మోహ పశువు! స్వాతిని బలాత్కరించ బోతున్నాడు! నలగపొడవండీ దుర్మార్గుడిని!

[ముగ్గురూ మాధవుడిని పట్టుకొని మర్దించారు. స్వాతి నిశ్చేష్టితయై నిలబడిపోయింది.]

గురు:_'నెట్టండీదుర్మార్గుడిని ఆశ్రమం బయటికి. ఆశ్రమ బహిష్కారమే యీ నీచునికి తగిన శిక్ష!'

[దెబ్బలకు సొమ్మసిలిపడిఉన్న మాధవుడిని ముగ్గురు శిష్యులూ ఈడ్చుకుపోయారు. తెర వాలింది. ప్రేక్షకులలో ధ్వని బయలుదేరింది.]

తలంచని విధంగా కథ పరిణమించింది. మాలతి వెర్రిగా నా వైపు చూస్తూ 'అనూ! ఈ కథ ...' ఆమె ఏదో చెప్పాలనుకొని చెప్పలేకపోయింది.

'చెప్పు మాలతీ! చెప్పు' అని అడిగాను నేను.

'అనూ! మాధవుడు! ...'

'ఆఁ మాధవుడు ...'

ఇంతలోనే తెర పైకి లేచింది.

పగిలిపోయిన భిక్షాపాత్రతో చిరిగిన చింపిరి బట్టలతో - ధూసరితమైన చిందర వందర జుట్టుతో - మూర్తీభవించిన విషాదంతో - రూపొందిన భగ్న హృదయంలా మాధవుడు నిలబడి పిచ్చి నవ్వుతో పాడుతున్నాడు.

ప్రేమకు చోటే లేదా జగాన!
జగాన ప్రేమకు చోటే లేదా!
నా బ్రతుకే నిరాశా!
నా లత నా కిక లేదా!
నా దరికిక మరి రాదా!
ప్రేమకు చోటేలేదా జగాన!
జగాన ప్రేమకు చోటేలేదా!

ఉన్నట్లుండి నా ప్రక్కనున్న మాలతి పిచ్చిదానిలా, 'బ్రహ్మచారీ! బ్రహ్మచారీ! ఇదిగో నీ లతను! ఉండు! - 'అని అరుస్తూ స్టేజీముందు కురికింది. స్టేజీ పైకి వెళ్ళటానికి వీలుగానున్న మెట్లు మీదుగా పైకెక్కి మాధవుని పాదాలపై వ్రాలింది! 'లతా! లతా' - అని ఆ మాధవ పాత్రధారి మాలతి భుజాలు పట్టుకొన్నాడు!! (ఇది అంతా వ్రాయడానికింతసేపు పట్టిందికాని ఆ నాడు రాత్రి మా మాలతీ మాధవులు ఆ రంగస్థలంమీద కల్సుకోటం, పరస్పరం గుర్తించుకోటం ఒక్క క్షణంలో జరిగింది.) ప్రేక్షకుల్లో కలకలం బయలుదేరింది. చాలామంది లేచినిలుచున్నారు. రంగస్థలాన్ని చుట్టుముట్టారు కొంతమంది. మాలతిని సమీపించడానికి నాకు సాధ్యం కాకపోయింది. జనాన్ని తోసుకొంటూ మాలతినాన్న, 'మాలతీ! మాలతీ' అని అరుస్తూ స్టేజీపైకెక్కిపోయాడు.

నాటకం కంపెనీ మానేజరుగాబోలు స్టేజీమీదకు వచ్చి నిశ్శబ్దంగా కూర్చోమని ప్రార్థించి జనాన్ని కూర్చోబెట్టాడు.

మాలతి:_" నాన్నా! వీరే ఆ బ్రహ్మచారి - దుర్మార్గులైన ఆ ఆశ్రమ వాసులచేత దండించబడి నాకోసంయిలా తయారయ్యారు. ఇదంతా నా కారణంవల్లనే జరిగింది నాన్నా!"

సత్యనారాయణబాబు మాధవుని చేతులుపట్టుకొని 'నాయనా! ఎన్నాళ్ళకు కనుపించావు' అని ఆప్యాయంగా పలకరించాడు.

ఇంతలో నాటకం మానేజరు, సెక్రటరీ లత తండ్రిని సమీపించారు. లత తండ్రి వారిద్దరికీ నమస్కరించాడు.

'బాబూ! ఈ ముసలివాడికి పుత్రికాభిక్ష పెట్టి పుణ్యం కట్టుకొన్నారు. ఈ మాధవునికోసమే రాత్రింబవళ్లు ఏడుస్తూ ఏడుస్తూ కృశించి యిన్నాళ్లు బ్రతికింది నా వెర్రి తల్లి. నా కుటుంబాన్ని కాపాడిన మీ నాటక కంపెనీ ఋణాన్ని తీర్చుకోలేను.'

మానేజరు:—'అయితే మా మాధవుడు వ్రాసిన డ్రామా - ఇంత వరకు ఆడిన డ్రామా - ఒకప్పుడు నిజంగా జరిగిన కథే అన్నమాట!

సెక్రటరీ అందుకొన్నాడు - నవ్వుతూ - అంతా జగన్నాటకం!

◆ ◆ ◆

మా మాలతికి - కాదు — లతకు, మాధవునికీ వైభవంగా పెండ్లి జరిగింది. తన పిచ్చికి కారణం - ఆమె యింతకాలం దాచిపెట్టినా నిజం కన్నులారా చూచాము నాటకంలో.

నిజంగా ఇప్పుడు మా మాలతిని 'లతా!' అనే పిలుచుకుంటున్నాము.

---

డాక్టరు కే. యన్. కేసరిగారి రచన
'నా చిన్ననాటి ముచ్చట్లు'
వెల రు. 3-0-0
అన్ని హిగిన్ బాదమ్సు స్టాల్సులోను దొరుకుతవి.

ఏజంట్లు కావాలి!
రాజమహేంద్రవరం, హైదరాబాద్, సికిందరాబాద్, ఒంగోలు, కడప, తిరుపతి — యింకా యితర ప్రదేశాలలో మాపత్రికలు అమ్మబడని చోట్లలో తమ స్వంత బాధ్యతపై అమ్ముటకు - ఏజంట్లుగా నున్నవారికి రూ. 100/-కు రూ. 20/-లు. కమీషను, ఒక ఫ్రీకాపీ యివ్వబడును.
అడ్వర్టైజిమెంటులను కాన్వాస్ చేయువారికి మంచి కమీషను సదుపాయముల నివ్వగలము.
వివరములకు:
గృహలక్ష్మి కార్యాలయం
రాయపేట, మద్రాసు-14